# నాగరికత

మూడు రోజుల్నించి పడుతున్న ముసురువాన అవాళ తెల్లవారు ఝామునే తెరిపిచ్చింది.

ఆకాశం స్వచ్ఛంగా వుంది. బస్సు స్టాండు బురద, నీటి గుంటల మయంగా వుంది. మూడు రోజుల తరువాత తొలిసారిగా కనిపించిన సూర్యుడు బారెడు పైకిలేచాడు. ఎండ కర కర్లాడుతూంది. నీటి గుంటల్లో సూర్యకాంతికి కళ్లు చెదురుతున్నాయి.

బురదనీ, నీటిగుంటల్నీ తప్పుకుని మనుషులు హడావిడిగా తిరుగుతున్నారు. కొందరు తాపీగా చుట్టలు, సిగరెట్లు కాలుస్తూ పుస్తకాల షాపుల్దగ్గిర పుస్తకాలు తిరగేస్తున్నారు.

'సినిమా పాటల పుస్తకాలు, మదన కామరాజు కథలు, డిటెక్టివ్ నవలలు, కవి చౌడప్ప శతకం...' అమ్మకాలు.

'ప్రేమించి పెళ్ళి చేసుకో...' లౌడ్ స్పీకరు గొంతిక.

'బాబూ ధర్మం— అమ్మా ధర్మం' ముష్టివాళ్లు.

'మరి వుంటానూ, వెళ్ళగానే వుత్తరంరాయి' వీడ్కోలు మాటలు.

ఎండ కరకరపొడిచినా, రివ్వున గాలి వీస్తూంది. బస్సులు ముందుకీ వెనక్కీ డ్రిల్లు చేస్తూ ఘుర్ఘరిస్తున్నాయి.

ఉదయం యేడున్నర.

నేనూ బస్సు కోసం ఎదురుచూస్తున్నా.

దూరంగా మేదరిగూడెం. అన్నీ పాకలు. ఆ చుట్టు పక్కలంతా కుళ్ళు బురద, కంపునీరు.

దూరంగా మేదరివాళ్ళు తిరుగుతున్నారు. కొందరు అక్కడే పబ్లికుగా మలవిసర్జన చేస్తున్నారు.

చిన్నా పెద్దా చాలా పందులు గునగున తిరుగుతున్నాయి. అపురూపంగా వచ్చిన ఆ వుదయపు ఎండలో అవికూడా ముచ్చటగావున్నాయి. అవి ఆనందముగా 'గుర్ గుర్' మంటూ, వంకతిరిగిన చిరుతోకలు ఆడిస్తూ దొరికింది మేస్తున్నాయి.

పరాగ్గా ఇంకో వేపు చూస్తున్నా. హటాత్తుగా పంది 'గీ' అని అరిచింది. అటుచూశా. నలుగురు మనుషులు పందిని తలకిందులా మోసుకు పోతున్నారు. ఆ పంది నీరసంగా 'గీ గీ' అంటుంది.

అక్కడికి కొంచెం యెగూని తాటాకుల పోగులోంచి పొగదట్టంగా లేస్తూంది. ఆ పొగలోంచి మనుషులు హడావిడిగా తిరుగుతూ అవుపిస్తూన్నారు. ఒకళ్లిద్దరు తాటాకులతో విసురుతూ, తాటాకు మంటల్ని రాజబెడుతున్నారు. ఇద్దరు గొంతికిలా కూచుని చూస్తున్నారు. మోసు కొచ్చినవాళ్ళ పందినక్కడ దింపేరు. అది కదల్డంలేదు. కాని ఇంకా సన్నంగా 'గీ' అంటూంది.

విసురుతున్న వాళ్ళు తాటాకులతో జోరుగా విసరారు. చిన్న చిన్న మంటలు లేచి నాట్యం చేస్తున్నాయి. పొగ ఒక స్థంభంలా ఆకాశం పొడుగునా లేచింది.

గొంతుకిలా కూచున్న వాళ్ళు లేచి పందిని మంటల్లో పెట్టేరు. విసురుతున్న వాళ్లు మరీజోరుగా గాలి విసిరేరు. పంది వెంట్రుకలు మాడిపోతున్నాయి కామోసు. ఒకడు దువ్వెనతో దువ్వినట్టు దేంతోనో గీసేస్తున్నాడు. మంటలు మరి కొంచెం లేచేయి.

గొంతుకిలా కూచున్నవాళ్లు తిరిగి గొంతికిలా కూచున్నారు. విసురుతున్న వాళ్ళు మరీ జోరుగా విసిరేరు. కర్రపట్టుకున్నవాడు, మరో ఇద్దరు తిరిగి వచ్చిన వేపు వెళ్ళేరు.

ఈ కార్యక్రమం సినిమాలో 'లాంగ్ షాట్'లా కనిపిస్తూంది.

నాక్కావలసిన బస్సింకా రాలేదు. ఇవాళ ఆలస్యంగా వస్తుందేమో. వచ్చే ప్రతి బస్సూదూరంనుంచి వుదయపు ఎండలో తళతళ మెరుస్తూ, నా ఆశా దీపాన్ని ప్రజ్వరిల్లజేస్తూంది.

అక్కడ తాటాకుల మంటలు బాగాలేచాయి. పొగ సన్నగిల్లింది. జ్వాల హెచ్చింది.

పరాగ్గావున్నా. ఇటు వెంపు మరో పంది 'గీ' అంది. తుళ్ళిపడ్డా.

పంది వెనక్కాళ్ళకి బంధం, నెత్తిమీద దెబ్బ వొకేసారి పడ్డాయి. పంది అడ్డంగా తిరగబడింది నేలమీద. బంధం బాగా పడకుండా తప్పించేందికి తన్నుకుంటూంది.

ఆ మనిషి సన్నగా పొడుగ్గా వున్నాడు. లుంగీ కట్టుకున్నాడు. పొడుగాటి గిరజాల జుత్తు. అతని చేతిలో అతనికంటే పొడుగ్గా రోకలిలాంటి బలమైన కర్రవుంది. యమదూతలా వున్నాడు.

పంది బంధం బలంగా పడనీకుండా, ప్రాణంకోసం, పంది బతుకైనా బతకడంకోసం గింజుకుంది. కట్టు వూడినంత పనైంది. యమ దూత రెండుచేతులతోటి రోకలెత్తి, వెనక వెంపు నేలతాకేవరకూ ఆచపెట్టి,

బలంకొద్దీ దాని చెంపమీద మోదాడు. నా మొహం ఝుమాలుమంది. పంది గజేంద్రుడిలా 'పాహి పాహి' అని వొకచావుకేక వేసింది.

దానికి చావాల్నిలేదు. పందిచావు చావాల్ని లేదు.

తిరిగి వొక విదిలింపు విదిలించింది. బంధిస్తున్న బంధాలు విడిపోయినంత పనైంది.

వెంటనే యమదూత తిరిగి రోకలియెత్తి బలంగా పార్శ్వ భాగంమీద వరసగా దభీ దభీమని యిరవైసార్లు మోదాడు. దెబ్బ దెబ్బకి ఆ ప్రాణి 'గీ' పెట్టింది. గింజుకుంది. పంది ప్రాణం ప్రాణంకాదా ? దానికి ప్రాణం మీద తీపిలేదా ? క్రమేణా దాని స్వరం సన్నగిల్లింది. ఆ రోకలి దెబ్బలికి దాని శరీరంలో సుమారు అన్ని యెముకలూ విరిగిపోయుంటాయి.

నా కాళ్లు గజగజలాడాయి. నేలా, నింగి గిరగిర తిరుగుతున్నాయి. కడుపులో తిప్పింది. వాంతి వచ్చినట్లయింది.

ఆ పందిని కూడా వాళ్ళు తలకిందులా మంటల్దగ్గిరికి మోసుకుపోయేరు. అక్కడ దింపేరు. ఎండలో యమదూత గిరజాలు దులుపుకుని రోకలినానుకుని నిలబడ్డాడు.

వెంటనే గొంతికిలా కూచున్న వాళ్ళ లేచి పందిని మంటల్లో పెట్టేరు. తాటాకులవాళ్ళ జోరుగా విసిరేరు. ఎండలో మంటలు నాట్యం చేసేయి. మాడిపోయిన పంది వెంట్రిక లొకడు దేంతోనో గబగబ దువ్వేసేడు.

ఇంత నిర్దయగా, నిండు ప్రాణాన్ని, గట్టి ప్రాణాన్ని రోకలితో పగంతీసి, మిగిలిన సగాన్ని తాటాకు మంటలో కాల్చిన వీళ్లు మనుషులా ?

వీళ్లు మనుషులయితే వట్టి అనాగరికులు. ఇంకా అడవి మృగాల స్థాయీలో వున్నారనుకున్నా.

ఈ దారుణ సంఘటన నన్నెంతో కాలం వెంటాడింది. భగవాన్ ! నాకేపుట్టుకైనా ఇయ్. కాని పంది పుట్టుక వద్దు. ఆ యమదూత - వాడి రోకలి-తాటాకుల మంటలు-భగవాన్ ! నేను భరించలేను.

ఈ ఉదంతం జ్ఞాపకం వచ్చినప్పుడల్లా, నేను పంది పుట్టుక పుడతానా - అమ్మో! అని ముచ్చెమటలు పోసిపోయేవి. ఆ యమదూత రోకలి నా కళ్ళ ముందు నాట్యం చేసేది.

కాని, కాలక్రమేణా యీ భీకర యజ్ఞకాండ నా స్మృతి పథంలో చెరిగిపోయింది.

కొన్నాళ్ళ తరవాత ఒక సాయంత్రం నేనొక పెద్ద డిపార్టుమెంటలు స్టోర్సుకి వెళ్లా. అక్కడ జనం కిట కిటలాడుతున్నారు.

నేను స్టోర్సు లోపలికి వెడుతూంటే యెదురుగా ఒక పురుషుడూ, ఒక స్త్రీ వస్తున్నారు. వాళ్లు బహుశా దంపతులయుంటారు. తెల్లగా, ఆరోగ్యంగా దేవతల్లా వున్నారు. అతను ఖరీదైన సూటు తొడుక్కున్నాడు. ఆ యువతి సరికొత్త రకం చీర యౌవనపు పొంగు స్పష్టంగా కన్పించేలా ధరించింది. వాళ్ళ మొహాలమీద చిరునవ్వు వెలుగుతూంది. వాళ్లు రూపం ధరించిన నాగరికత, నడుస్తూన్న సభ్యతలా వున్నారు. ఇద్దరి చేతుల్లోనూ అందమయిన ప్లాస్టిక్కుసంచులున్నాయి. ఆ యువతి పట్టుకున్న సంచిలో, పైకవుపిస్తూ వొక రంగు రంగుల అందమయిన డిజైనుగల చిన్న డబ్బా వుంది.

ఆ డబ్బామీద ఇంగ్లీషులో 'బేకన్' అని వుంది. నా దృష్టి దాని మీద పడింది.

వెంటనే నా తల తిరిగింది. నా కాళ్ళ కిందనేల, స్టోర్సు పైకప్పు గిర గిర తిరుగుతున్నై.

భగవాన్! ఎవడు వాడు! గిరజాల జుత్తు. పొడుగ్గా లుంగీ, రోకలి లాంటి పొడుగాటి కర్ర. వెనక వెంపు భూమి తాకే వరకూ ఆచిపెట్టి బలం కొద్దీ మోదుతున్నాడు. ప్రభూ! ఈ వేదన భరించలేను. ప్రాణం పోతూంది. పాహి పాహి— అని పంది గీపెడుతూంది.

అందమైన రంగు రంగుల డబ్బా నాగరికతకి చిహ్నం. అందులో వున్న పంది యేడుపో? దుస్తులు నాగరికతకి చిహ్నం. ఆ దుస్తుల్లోవున్న మనుషులో?